ప్రజాశక్తి

గురువారం 10 నవంబర్ 2022 5 విజయనగరం

18న జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

30వ జాతీయ బాలల సైన్సు కాంగ్రెస్ జిల్లా స్థాయి ప్రాజెక్టుల ప్రదర్శన ఈనెల 18న విజయనగరంలో జరుగనుందని జిల్లా విద్యా శాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు, జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ మిరియాల కృష్ణారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోగల అన్ని యాజమాన్యాల ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి మూడు లేదా ఐదు పాజెక్టులు చొప్పున జిల్లా స్థాయి ప్రదర్శనకు తీసుకురావాలని హెచ్ఎంలకు సూచించారు. ఒక ప్రాజెక్టుకు ఒక విద్యార్థి, ఒక ఉపాధ్యాయుడిని పంపించాలని తెలిపారు. రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ ఈనెల 10 అని, వివరాలకు 9440963424 నెంబరును సంప్రదించాలని తెలిపారు. బాలల సైన్సు కాంగ్రెస్ జిల్లా ప్రదర్శనలో పాల్గొనేందుకు అర్హతలు జూనియర్స్ విభాగం 10-14ఏళ్ల వయసు, సీనియర్స్ విభాగం : 14 - 17 ఏళ్ల వయసు ఉండాలని తెలిపారు.

వరికుప్పలు పెడుతున్న రైతులు

కమ్ముకున్న మబ్బులు
రైతుల్లో గుబులు

వాతావరణంలో మార్పులు రావడంతో రైతుల్లో గుబులు నెలకొంది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని వాతావరణశాఖ చేసిన ప్రకటనతో రైతులంతా ఆందోళన చెందుతున్నారు. ఏడాదంతా కష్టపడి సాగు చేసిన పంట మరి కొద్ది రోజుల్లో చేతికొస్తున్న వేళ తుపాను ముంచుకొస్తుందని తెలిసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల తుపానుతో నష్టపోయిన రైతులు మళ్లీ తుపాను హెచ్చరికలతో ఆందోళనకు గురవుతున్నారు.

- అల్పపీడనంతో మారిన వాతావరణం
- పొలంలోనే కోసేసిన వరిపంట
- కుప్పలు వేస్తున్న రైతన్నలు

ప్రజాశక్తి-బొబ్బిలి

జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్లో 2.34 లక్షల ఎకరాల్లోవరి సాగైంది. 90శాతం వరకు పంట కోత దశకు రావడంతో జిల్లా వ్యాప్తంగా కోతలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని వంగర, సంతకవిటి, గుర్ల, తెర్లాం, బొబ్బిలి మండలాల్లో ఎకరాల్లో ఇప్పటివరకూ వరికోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు సుమారు 400 ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి. కోసేసిన వరిపంట పొలంలోనే ఉండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వర్షం కురిస్తే వరిపంటకు తీవ్ర నష్టం వస్తుందని ఆందోళన చెందుతున్నారు. బుధవారం ఆకాశం పూర్తిగా మేఘావృతం కావడతో కోసేసిన వరి పంటను రైతులంతా కుప్పలు పెట్టే పనిలో ఉన్నారు. ఒకపక్క కోతలు ముమ్మరంగా జరగ్గా మరోపక్క కోసేసిన వరిపంటను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణం 3.21 లక్షల ఎకరాలు. ఖరీఫ్ సీజన్లో 1.71 లక్షల ఎకరాల్లో వరిసాగైంది. దాదాపు 90శాతం వరకు పంట కోత దశకు వచ్చింది. ఇప్పటికే పాలకొండ, సీతంపేట, కొమరాడ, పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇలాంటి తరుణంలో అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో మార్పులు రావడం, కోసేసిన వరిపంట పొలంలోనే ఉండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

వరిపంట కోత దశకు రావడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు కోసం రైతన్నలు ఎదురుచూస్తున్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

ఉక్కు ప్రయివేటీకరణ ఆపండి

- విభజన హామీలు, ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్యాకేజీపై మోడీ ప్రకటన చేయాలి : వామపక్షాల డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణను ఆపాలని, రాష్ట్ర విభజన హామీలను, ఉత్తరాంధ్ర ప్రత్యేక ప్యాకేజీ అమలు పై ప్రధానమంత్రి ప్రకటన చేయాలని, అందుకోసం ముఖ్యమంత్రి కృషి చేయాలని సిపిఎం, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎల్‌బిజి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ మాట్లాడారు. ఈనెల 11, 12 తేదీల్లో విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించే ప్రకటన చేయాలని, సొంత గనులు కేటాయించాలని, 8,500 మంది నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి బాధ్యత తీసుకొని ప్రధానితో ఉక్కుపైనా, రాష్ట్ర పునర్విభజన చట్టంలోని అంశాలపైనా ప్రకటనలు చేయించాలని కోరారు. ప్రధాని వద్దకు అఖిలపక్ష పార్టీల ప్రతినిధుల నాయకులను తీసుకొని వెళ్లాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రధాన సమస్యలను ప్రధాని దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈనెల 11న ప్రజాసంఘాలు చేపట్టిన నిరసన కార్యక్రమాలకు మద్దతు ప్రకటించినట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. విశాఖ కేంద్రంగా సౌత్ సెంట్రల్ రైల్వే జోన్ ఏర్పాటుపై 2019లో చేసిన ప్రకటన నేటికీ కాగితాలకే పరిమితమైందన్నారు. రైల్వేజోన్‌కు ప్రధాని శంకుస్థాపన చేస్తారని ప్రకటించిన నేపథ్యంలో నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని కోరారు. వాల్తేరు డివిజన్ ను విశాఖలోనే కొనసాగించాలని, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, వి.లక్ష్మి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

విభజన హామీలను అమలు చెయ్యాలి :ఎస్ఎఫ్ఐ

రాష్ట్ర విభజన హామీలు అమలు చేయాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖ పర్యటనకు ఏ మొహం పెట్టుకుని వస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రం విడిపోయే సమయంలో ఆంధ్ర రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు గిరిజన యూనివర్సిటీకి నిధులు విడుదల, వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, పోలవరం ప్రాజెక్ట్ పూర్తి చెయ్యడం, సుజల స్రవంతి ప్రాజెక్టుకు నిధులు, కడప ఉక్కు పరిశ్రమ, రాజధాని నిర్మాణానికి నిధులు వంటి వాటిని నెరవర్చాకే ఉత్తరాంధ్ర పర్యటన చెయ్యాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా నిరసనలు చేస్తున్న కార్మికులపై, ప్రజా సంఘాల నాయకులపైనా అక్రమంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్బంధం విధించి అరెస్టులను చెయ్యడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఇప్పటికైనా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పునరాలోచన చేసి కేంద్ర బిజెపి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విభజన హామీలకై, రాష్ట్రాల హక్కులకై పోరాటం చెయ్యాలని పేర్కొన్నారు. లేని పక్షంలో జిల్లాలోని విద్యార్థులను, యువకులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, మేయర్ విజయలక్ష్మి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వివిధ డివిజన్లలో 1 కోటి 22 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. 29, 31, 32, 33 డివిజన్లలో కాలువలు, కల్వర్టులు, రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేయగా, నూతనంగా నిర్మించిన పార్కులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నిరంతరం పట్టణ అభివృద్దే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శ్రమిస్తున్నారన్నారు. పట్టణాన్ని ఆహ్లాదకరంగా తయారు చేస్తున్నారని తెలిపారు. 29వ డివిజన్లో ప్రజల ఆకాంక్షల మేరకు అనతి కాలంలోనే పార్కును నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామన్నారు. డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ తమ డివిజన్లో ఇప్పటివరకు రూ.2.50కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రామకృష్ణ నగర్ ప్రాంతంలో బాబా గుడి రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో 32వ డివిజన్ కార్పొరేటర్ భోగాపురపు లక్ష్మి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండల డైరెక్టర్ బంగారు నాయుడు, జోనల్ ఇన్ ఛార్జులు రెడ్డి గురుమూర్తి, కనకల కృష్ణ, వైసిపి నాయకులు భోగాపురపు రవిచంద్ర, ఎ.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

హిజ్రాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి

హిజ్రాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. బుధవారం లిఫ్టింగ్ హేండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కామాక్షి నగర్‌లో ఉన్న కాపు సంక్షేమ భవనంలో పుట్టింటి సారె సమర్పణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జీసస్ క్రీస్ట్ బ్లెస్సింగ్స్ మినిస్ట్రీస్ ప్రతినిధులు నాగేశ్వరరావు, లక్ష్మీ దంపతులు హిజ్రాలకు సారె సమర్పించారు. ఈ సందర్భంగా కోలగట్ల వీరభద్ర స్వామిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ సమస్య ఉన్నా నేరుగా తన వద్దకు రావచ్చని చెప్పారు. సమాజంలో హిజ్రాలు మంచి కోరే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు కాబట్టి అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి ముందుంటా నన్నారు.కార్యక్రమంలో లోక్ సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్యారోగ్య రంగం పనితీరు ప్రశంసనీయం

- సఖి, ఫ్యామిలీ డాక్టర్ సేవలు, మౌలిక సదుపాయాలు భేష్
- వైద్యసేవల పట్ల కేంద్ర బృందం సంతృప్తి
- కుటుంబ నియంత్రణపై దృష్టిపెట్టాలని సూచన

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో వైద్యారోగ్య రంగం పనితీరును కేంద్ర బృందం అభినందించింది. ముఖ్యంగా సఖి, ఫ్యామిలీ డాక్టర్ సేవలు, మౌలిక వసతుల కల్పన, ఆశా, ఇతర సిబ్బంది పనితీరు, పర్యవేక్షణ, మందుల సరఫరా తదితర అంశాలను ప్రత్యేకంగా ప్రశంసించారు. జాతీయ ఆరోగ్య మిషన్, ఎన్‌హెచ్ఆర్‌సికి చెందిన 15వ కామన్ రివ్యూ మిషన్ ఏడుగురు సభ్యుల బృందం జిల్లాలో నాలుగు రోజులపాటు పర్యటించింది. గ్రామాల్లో పర్యటించి, వైద్యరంగంలో క్షేత్రస్థాయి పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. సిబ్బందితో, ప్రజలతో మాట్లాడి, వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ పర్యటనలో వీరు పరిశీలించిన అంశాలను, బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారికి వివరించారు. పలు సూచనలు చేశారు.

కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ రంజన్ కుమార్ చౌదురి, డాక్టర్ అంకుర్ నాయర్, విశాల్ కటారియా, డాక్టర్ విజయ్ రజనా, డాక్టర్ శ్వేతాశర్మ, డాక్టర్ మోనికా షైనీ, డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ, తాము అధ్యయనం చేసిన విషయాన్ని అంశాలవారీగా వివరించారు. క్షేత్రస్థాయిలో ఎఎన్ఎం, ఆశా వర్కర్లు, వైద్యులు ప్రజలకు మంచి సేవలను అందిస్తున్నారని చెప్పారు. సఖి గ్రూపులు మెరుగైన ఫలితాలను ఇస్తున్నాయ చెప్పారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం చాలా మంచి ప్రయత్నమని అభినందించారు. టిబి నియంత్రణతోపాటు మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ తదితర వ్యాధుల నిర్మూలనా కార్యక్రమాలను చక్కగా అమలు చేస్తున్నారని చెప్పారు. రిఫరల్ విధానంలో మార్పులు తేవాల్సి ఉందని కేంద్ర బృందం సూచించింది. అత్యవసర రోగులను పిహెచ్‌సిల నుంచి జిల్లా కేంద్రాసుపత్రికి లేదా ఇతర పెద్ద ఆసుపత్రులకు నేరుగా తరలించడం వల్ల, విలువైన సమయం ఆదా అవుతుందని చెప్పారు. ఘోషా ఆసుపత్రిలో పనిచేస్తున్న టెలీమెడిసిన్ సేవలను 24 గంటలకు విస్తరించాలని సూచించారు. సాధారణ ప్రసవాలు పిహెచ్‌సిల్లోనే పిహెచ్‌సిల్లో జరిగేలా చూడాలని, రిస్క్ ఉన్నవాటిని మాత్రమే తరలించాలని సూచించారు. కుటుంబ నియంత్రణా కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని కోరారు. కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను పెంచాలన్నారు. మహిళల్లో రక్తహీనత ఎక్కువగా ఉందని, దీనిని నివారించడానికి కృషి చేయాలని అన్నారు.

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, కేంద్ర బృందం సభ్యులు

కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ, కేంద్ర బృందం ఆశించిన మార్పులను ఆరు నెలల్లో తీసుకువచ్చేందుకు కషి చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో వైద్యారోగ్యశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్, జాయింట్ డైరెక్టర్ అర్జునరావు, డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎస్‌వి రమణకుమారి, డిసిహెచ్ఎస్ డాక్టర్ జి.నాగభూషణరావు, ఇతర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాదికి గ్రంథాలయ సంఘం పురస్కారం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఏటా జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎపి గ్రంథాలయ సంఘం ప్రదానం చేసే పురస్కారానికి విజయనగరానికి చెందిన సీనియర్ పాత్రికేయులు పంచాది అప్పారావు ఎంపికైనట్లు ఎపి గ్రంథాలయ సంఘం జిల్లాశాఖ అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీన పురస్కారాన్ని ప్రదానం చేయనున్నామని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రావాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం

ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాని వారిని లే ఔట్లకు తీసుకు వచ్చి వారిని చైతన్యం చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు నాయుడు తెలిపారు. ఆప్షన్ 1, 2 కింద వచ్చిన వారంతా వచ్చే శనివారం నాటికి ఖచ్చితంగా పనులు ప్రారంభించాలని, లేదంటే పట్టాలను వెనక్కి ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో హౌసింగ్ పీడీ రమణమూర్తితో కలసి సచివాలయాల వారీగా గృహాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలో 15103 ప్లాట్లు, 10060 గృహాలు మంజూరు చేశామని తెలిపారు. 241 ఇంకా ప్రారంభం కాలేదని, వీరందరినీ ఒప్పించి నిర్మాణాలు చేపట్టాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బాధ్యతని తెలిపారు. బాంక్ ఖాతాలను ఓపెన్ చేయని వారితో వెంటనే ఖాతాలను ఓపెన్ చేయించాలని ఆదేశించారు.

19 నుంచి తెల్లరేషన్ కార్డుదారులకు ఉచిత బియ్యం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో తెల్లరేషన్ కార్డుదారులకు ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ అన్న యోజన పథకం కింద ఉచిత బియ్యం పంపిణీ చేయనున్నట్లు జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. నవంబరు నెలకు సంబంధించి ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు రేషన్ డిపోల ద్వారా ఉచిత బియ్యం పంపిణీ జరుగుతుందని ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కొక్క లబ్దిదారునికి 5 కిలోల చొప్పున, జిల్లాలోని 27 మండలాలకు చెందిన 5,51,066 మంది ఎన్ఎఫ్ఎస్ఎ కార్డుదారులందరికీ ఈ బియ్యాన్ని ఉచితంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం

మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలతో తాత్కాలిక సెక్టార్ సూపర్‌వైజర్ విధులు నిర్వర్తించేందుకు ఈనెల 9 నుంచి 13వరకు శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం మహిళా ప్రాంగణంలో ప్రారంభించారు. రీజినల్ జాయింట్ డైరెక్టర్ జి. చిన్మయిదేవి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ బి.శాంతి కుమారి పాల్గొన్నారు. సిడిపిఒలు జి.ప్రసన్న, డి.ఉమాభారతి, కె.విజయ కుమారి, శ్రీరాము, పోషణ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నగర అధ్యక్షులుగా లక్ష్మీవరప్రసాద్

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపి నగర అధ్యక్షులుగా ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్ నియమితులయ్యారు. బుధవారం స్థానిక అశోక్‌బంగ్లాలో ఆయనకు పార్టీ నాయకులు కర్రోతు నర్సింగరావు పార్టీ కండువా వేసి భాద్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఆనంతరం మున్సిపల్ మాజీ ఛైర్మన్ ప్రసాదుల కనకల మహాలక్ష్మి, ప్రసాదుల రామకష్ణ మాట్లాడుతూ తన కుమారునికి నగర పార్టీ అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించినందుకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు

ప్రజాశక్తి- విజయనగరం కోట

మహారాజ ప్రభుత్వ సంగీతం నృత్య కళాశాల, మహారాజా కళాశాలలో గురువారం నుంచి నిర్వహిస్తున్న జిల్లా స్థాయి యువజన ఉత్సవాల్లో యువతీ యువకులు పాల్గొనాలని సెట్విజ్ సిఇఒ బి. రామానందం కోరారు. ఈ పోటీలు మొత్తం 25 అంశాలపై ఉంటాయన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలైన వారు రాష్ట్రస్థాయిలోనూ, అక్కడ ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాల్లో గెలుపొందిన వారు జాతీయస్థాయిలో తప్పనిసరిగా పాల్గొనవలసి ఉంటుందని తెలిపారు. జాతీయస్థాయిలో పాల్గొన్న వారికి టిఏ, డిఎలు ఇస్తామన్నారు.

మోడీ సభలో మన వాణి వినిపించాలి

కార్యకర్తల సమావేశంలో మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విశాఖపట్నంలో ఈనెల 12న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగే ప్రధాని నరేంద్ర మోడీ సభను ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వైసిపి శ్రేణులు తరలివెళ్లి మన వాణి వినిపించాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్య నారాయణ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని సుజాత కన్వెన్షన్‌లో జరిగిన వైసిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 12న రూ.12వేల కోట్లతో పలు అభివద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాలను ప్రధాని నరేంద్ర మోడీ చేస్తారని తెలిపారు. ఈ సభకు అన్ని నియోజకవర్గాల నుంచి భారీగా తరలిరావాలని కోరారు. రాబోయే ఎన్నికలలో వైసిపి 175 స్థానాలలో విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. విజయనగరంలో టిడిపి నాయకులు పగటి వేషగాలుగా తిరుగుతున్నారని అన్నారు. మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతి రాజు మాట్లాడే తీరు సరికాదన్నారు. ఏ టువంటి దళారులు, దోపిడి విధానం లేకుండా సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయని అన్నారు. పట్టణ, జిల్లా అభివృద్ధి విషయంలో చర్చకు రావాలని హితవు పలికరు. అశోక్ గజపతి రాజు చెట్ల కింద కూర్చుని ప్రకటనలు చేయడం కాదని, ప్రజల్లోకి వస్తే వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోనే విజయ నగరం నియోజకవర్గం అభివృద్ధిలో ముందుందని అన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పనలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా 2024 కల్లా తారకరామ తీర్ధ సాగర్ పూర్తవుతుందని అన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టు శంకుస్థాపనకు అన్ని అనుమతులు వచ్చాయని అన్నారు. శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు విజయనగరం నియోజకవర్గంలో 17,856 ఓట్లను పార్టీ నాయకులు, పార్టీ ప్రజా ప్రతినిధుల సహకారంతో నమోదు చేశామని తెలిపారు. మోడీ సభకు జనాలను తరలించేందుకు విజయనగరం నియోజకవర్గానికి వంద బస్సులు కేటాయించా మన్నారు. గడపగడపకూ కార్యక్రమం అని, ప్రజా స్పందన బాగుందని అన్నారు. నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ తమ ఉనికిని చాటుకోవడానికి ప్రతి సోమవారం పదిమందితో కలెక్టరేట్లో గ్రీవెన్స్ సెల్ కి వెళ్లి ఆర్జీ ఇవ్వడం అలవాటై పోయిందని అన్నారు. వార్డు, కమిటీలు, అనుబంధ సంఘాల కమిటీలు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు.

ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన విజయనగరంలో రూ.460 కోటతో 8 ఎకరాలలో ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని అన్నారు. అనంతరం ఎమ్మెల్సీ సురేష్‌బాబు మాట్లాడారు. నగర పార్టీ అధ్యక్షుడు ఆసపు వేణు అధ్యక్షన జరిగిన సమావేశంలో నగర మేయర్ వెంపటాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, ఫ్లోర్‌లీడర్ ఎస్‌వివి రాజేష్, మండల పార్టీ అధ్యక్షులు నడిపేనా శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి సభ్యులు కె శ్రీనివాసరావు, డాక్టర్ సురేష్‌బాబు, జోనల్ ఇన్చార్జులు, పలువురు కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

నిమ్మల సురేష్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా వాణిజ్య పన్నుల శాఖ కార్యాల యంలో ఎసిటిఒగా విధులు నిర్వ హిస్తున్న, నిమ్మల సురేష్‌కు డాక్టరేట్ లభిం చింది. విజయ నగరం జిల్లా షెడ్యూల్ తెగల మధ్య విద్య, సామాజిక మార్పు అనే అంశంపై అధ్య యనం చేసినందుకు గాను ఆంధ్ర యూని వర్శిటీ డాక్టరేట్ ప్రకటించింది. జిల్లాలో జాతాపు, సవర, గదబ, కొండదొర తెగలలో సామాజిక మార్పులో విద్య పాత్రను పరిశీలించడం, వారి నిరక్షరాస్యతకు కారణాలపై విశ్లేషణ, విద్యా స్థాయిల కారణంగా జరుగుతున్న మార్పుల విశ్లేషణ, వారి సామాజిక, ఆర్థిక నిర్మాణంపై విద్య ప్రభావం, గిరిజన తెగలలో విద్యా పురోగతికి సంబంధించి ఆయన అధ్యయనం చేశారు. ఈనేపథ్యంలో ఆయనకు ఎయు సోషియాలజీ విభాగం డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈయన గతంలో ఎస్ఎఫ్ఐ నాయకుడిగా, ఎన్‌జిఒ నాయకులుగా, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులుగా సేవలందించారు. ప్రస్తుతం ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శిగా ఉన్నారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ధాన్యం సేకరణకు సంబంధించిన అధికారులంతా సన్నద్ధం కావాలని కలెక్టర్ సూర్య కుమారి ఆదేశించారు. ఇప్పటికే మెరకముడిదాం, సంతకవిటి, తెర్లాం, వంగర మండలాల్లో కోతలు ప్రారంభమైనందున ఈ మండలాల్లో కొనుగోలు కోసం ఏర్పాట్లు చేయాలని సూచించారు. బుధవారం కలెక్టర్ తన ఛాంబర్ లో ధాన్యం కొనుగోలుపై సమీక్షించారు. మిల్లర్లు ఈనెల 15 లోగా బ్యాంకు గారంటీలు సమర్పించాలని తెలిపారు. కేంద్రాల వద్ద అవసరమైన గన్నీలను, తేమ యంత్రాలను, ఐఇసి సామగ్రిని, కాటాలను సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఉపాధి హామీలో వంద రోజులు పని పూర్తి చేసుకున్న కూలీలను హమాలీలుగా పంపించాలని డ్వామా పీడీకి తెలిపారు. వాహనాలతో పాటు రూట్ ఆఫీసర్లు ఆర్‌బికె నుండి మిల్లుల వరకు పర్యవేక్షిస్తారని తెలిపారు. జిల్లా అంతటా డిసెంబర్ నుండి కోతలు ప్రారంభం అవుతాయని, అధికారులంతా సమన్వయం చేసుకొని లోపాలు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, డిఎస్ఒ మధుసూదన్, పౌర సరఫరాల జిల్లా మనేజర్ మీనా కుమారి, జిల్లా పరిషత్ సిఇఒ అశోక్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి తారక రామారావు, డిసిఒ రవాణా కమిషనర్, డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మల్బరీ సాగును విస్తరించాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

జిల్లాలో మల్బరీ సాగును మరింత విస్తృతం చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి పట్టు పరిశ్రమ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలో మల్బరీ సాగుకు అందుబాటులో వున్న వసతులను వినియోగించుకొని ఈ పరిశ్రమను విస్తరించాలని చెప్పారు. వేణుగోపాలపురంలోని పట్టుపరిశ్రమ శాఖ ఎడి కార్యాలయం వద్ద వున్న సిల్క్ రీలింగ్ యూనిట్‌ను, విత్తనాల ఉత్పత్తి క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ సూర్యకుమారి బుధవారం సందర్శించారు. పట్టు నాణ్యత, ఉత్పత్తి తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. జిల్లాలో పట్టుపరిశ్రమ అభివృద్ధి అవకాశాలపై ఎడి ఎవి సాల్మన్ రాజుతో చర్చించారు. జిల్లాలో ప్రస్తుతం 392 మంది రైతులు 700 ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నారని ఎడి వివరించారు. మల్బరీ సాగు ద్వారా రైతులకు అధిక ఆదాయం వచ్చే అవకాశం వున్నందున దీనిపై రైతులకు అవగాహన కల్పించి ఈసాగు చేపట్టేలా ప్రోత్సహించాలని పట్టుపరిశ్రమ అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా ఇతర పట్టు వెరైటీలకు సంబంధించి టస్సర్ ప్లాంటేషన్‌ను కూడా మరింతగా పెంచాలని సూచించారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

నెల్లిమర్ల : మండలంలోని కొండవెలగా డలోని మొయిద పేటలో బుధవారం అభివృద్ధి పనులను జెడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి సుమారు రూ.10లక్షలు విలువైన సిసి కాలువలు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం గ్రామాన్ని దశలు వారీగా అభివృద్ధి చేస్తామన్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వ నిధులు సరిపోకపోతే తన సొంత నిధులను వెచ్చిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మొయిద అక్కోజీ, వల్లూరి రాము, వల్లూరి నరసయ్య, మొయిద నాగేంద్ర, రేవల్ల సింహాచలం, పూతికపేట మాజీ సర్పంచ్ యడ్ల గోవింద పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

నెల్లిమర్ల : దళిత రైతుల భూ సమస్యలు పరిష్కరించాలని టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఆయన తహశీల్దారుతో మాట్లాడారు. మండలంలో దళిత రైతులు భూ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దళిత రైతుల వద్ద భూములున్నా వాటి పట్టాలు, ధృవ పత్రాలు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దళిత రైతుల భూ సమస్యలు పరిష్కరించి, పట్టాలు ధృవ పత్రాలు మంజూరు చెయ్యాలని కోరారు. దీనిపై తహశీల్దార్ కె. వి. రమణ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం డ్రోన్ సర్వే చేపట్టిందని సర్వేలో అర్హులైన వారిని గుర్తించి పట్టాలు ఇస్తామన్నారు.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

గుర్ల : మహిళలు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి సూర్యనారాయణరాజు అన్నారు. మండలంలోని గూడెం గ్రామంలో గురువారం దుర్గ శాంతి మదర్ పౌల్ట్రీ కోళ్ల ఫారంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీనికి మండల సమాఖ్య నుండి రూ.లక్ష అప్పుగా అందిస్తున్నారన్నారు. యూనిట్ మొత్తం ఖరీదు రూ. 2లక్షలని అన్నారు. ఈ యూనిట్‌ను గ్రామానికి చెందిన కె శాంతమ్మ నిర్వహించేందుకు ముందుకు రావడం మంచి పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సీర అప్పలనాయుడు , మండల నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు, మాజీ ఎంపిపి వరదా ఈశ్వర రావు, వైస్ ఎంపిపి తోట తిరుపతి రావు, సర్పంచ్ యజ్జిపురపు లక్ష్మణరావు, ఐకెపి ఎపిఎం నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బాగా చదివితేనే విదేశాల్లో ఉపాధి

నెల్లిమర్ల : ఉన్నత విద్య అభ్యసిస్తున్న వారికి విదేశాల్లో ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయని ఐ ప్లెస్ ఒవర్సీస్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ గ్రంధి దర్మ చైతన్య చెప్పారు. వాటికి కావాల్సిన అర్హతల గురించి ముందే తెలుసుకోవాలన్నారు. బుధవారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో 'విదేశాలలో ఉన్నత విద్య అవకాశాలు, స్థితిగతులు, విధి విధానాలు, సౌలభ్యత' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియాలలో మన దేశంలో కంటే అత్యధిక వేతనంతో కూడిన ఉపాధి అవకాశాలు అత్యధికంగా ఉన్నాయన్నారు. జిఆర్ఇ, టోఫెల్, జిమ్యాట్ గురించి వివరించారు. ఐఇఎల్టీఎస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పిఎస్వీ రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్ఎస్ వర్మ, డీన్ ప్రొఫెసర్ కృష్ణమూర్తి, సిఎస్ఇ విభాగాధిపతి లక్ష్మణ్, దీపక్ జోగినాయుడు, డీన్ డాక్టర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, పారామెడికల్, ఇంజనీరింగ్ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థులు

వంగర : మండలంలోని అరసాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు ఎన్ దినేష్ కుమార్, ఐ. గోవింద దొర అండర్14 విభాగంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు పాఠశాలలో అభినందన సభ బుధవారం నిర్వహించి ఎంపికైన విద్యార్థులకు అభినందించి జ్ఞాపికలను అందజేశారు. విద్యార్థులకు తర్ఫీదు అందించిన వ్యాయామ ఉపాధ్యాయుడు రామును అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం

వేపాడ : మండలంలోని గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లతో స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ పట్నాయక్ సమావేశం ఏర్పాటు చేశారు. సచివాలయంలో ఉన్న పనులన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. నమోదులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మానవ విలువలపై అవగాహన

డెంకాడ : మొదటి సంవత్సరం బిటెక్ విద్యార్థుల కోసం ఒక వారం ఇండక్షన్ కార్యక్రమంలో భాగంగా ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం బ్రహ్మ కుమారీలచే 'సార్వత్రిక మానవ విలువలు' అనే అంశంతో పాటు 'ఒత్తిడి నిర్వహణ' అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సార్వత్రిక మానవ విలువలు అంశానికి బ్రహ్మకుమారి రాజయోగ ఉపాధ్యాయులు వైష్ణవి, మాధురి మంజూష, రిసోర్స్ పర్సన్లగా వ్యవహరించగా డాక్టర్ జె గ్రహిత, డాక్టర్ ఎన్ దీప్‌చంద్ ఒత్తిడి నిర్వహణపై సెషన్‌కు రిసోర్స్ పర్సన్‌లుగా ఉన్నారు. బ్రహ్మకుమారీస్ మాట్లాడుతూ విద్యలో మానవీయ విలువల ప్రాముఖ్యతను, చదువులపై దాని ప్రభావాన్ని నొక్కి చెప్పారు. డాక్టర్ జె గ్రహిత డాక్టర్ ఎన్ దీప్‌చంద్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ జీవితంలో ఒత్తిళ్ల శరీరం, మనస్సుపై ఎలా ప్రభావం చూపుతుందో వివరించారు. ఈ సెషన్లకు, స్టూడెంట్స్ డీన్ మోహన్ కుమార్, ఇండక్షన్ ప్రోగ్రాం ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ డి. కృష్ణ, మొదటి సంవత్సరం బిటెక్ విద్యార్థులందరూ హాజరయ్యారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

బొబ్బిలి : మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డుల్లో గత కొన్ని ఏళ్లుగా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి బుధవారం మున్సిపల్ ఛైర్మెన్ సావు వెంకట మురళీ కృష్ణరావు భూమి పూజ చేసి, రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వైస్ ఛైర్మన్ చెలికాని మురళీకృష్ణ, గోలగాని రమాదేవి, వార్డు కౌన్సిలర్లు, ఇంచార్జీలు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌లో వాహనాల వేలం

బొబ్బిలి: బొబ్బిలి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. ఇందులో 17 వాహనాలను ఔత్సాహికులు సొంతం చేసుకున్నారు. దీని ద్వారా ప్రభుత్వానికి రూ.2,26,540 ఆదాయం సమకూరింది. ఈ వేలంలో రెండు కార్లు, రెండు ఆటోలు, 14 ద్విచక్ర వాహనాలను ఔత్సాహికులు సొంతం చేసుకున్నారు.

బెల్ట్‌షాపునకు వేలం నిర్వహించలేదు

బొబ్బిలిరూరల్ : నారాయణప్పవలసలో బెల్ట్ షాపుకు పాట నిర్వహించలేదని సర్పంచ్ జాగారపు శ్రీనివాసరావు అన్నారు. ప్రజాశక్తిలో మంగళవారం వెలువడిన సర్కారు వారి మద్యం పాట శీర్షికకు ఆయన స్పందించారు. గ్రామంలో ఏటా ఆనవాయితీగా నిర్వహిస్తున్న వ్యవసాయ కమీషన్ పాట నిర్వహించామని, బెల్ట్ షాపుకు పాట నిర్వహించలేదని చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా బెల్ట్ షాపు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. తాను ఏపార్టీకి చెందిన సర్పంచ్‌ను కాదని, ఇండిపెండెంట్‌గా ప్రజలు గెలిపించారని గుర్తు చేశారు.

చట్టాల గురించి తెలుసుకోవాలి : జిల్లా జడ్జి

గంట్యాడ: కెజిబివిలో భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా జడ్జి

ప్రజాశక్తి-గంట్యాడ

ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వామ్యం కావాలని, చట్టాల గురించి తెలుసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకొని పుట్టిన గడ్డ రుణం తీర్చుకునేందుకు సమయం కేటాయించాలని సూచించారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా కొటారుబిల్లి కెజిబివి బాలికా విద్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పలు న్యాయ పరమైన అంశాలపై, చట్టాలపై అవగాహన కల్పించారు. సదస్సు ప్రారంభానికి ముందు ఆయన స్థానిక పాఠశాలలోని వంటశాలను, తరగతి గదులను ఆయన పరిశీలించారు. అనంతరం మూడో అదనపు కోర్టు, ఫ్యామిలీ కోర్టు జడ్జి కె. రాధారత్నం, నాల్గవ అదనపు కోర్టు జడ్జి షేక్ షికిందర్ బాషా, సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ ప్రాధికార సంస్థ ఇంఛార్జి కార్యదర్శి జె. శ్రీనివాసరావులు మాట్లాడుతూ న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. డిఆర్ఒ ఎం. గణపతిరావు, జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ డి.ఎస్.పి. ఆర్. శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ కల్చరల్, స్పోర్ట్స్ కార్యదర్శి యు.వి. రాజేష్, సమగ్ర శిక్ష ఎపిసి వి. స్వామి నాయుడు, చైల్డ్ వెల్ఫేర్ జిల్లా ఛైర్పర్సన్ హిమబిందు తదితరులు మాట్లాడారు.

శృంగవరపుకోట : పేదవారికి కోర్టుల ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామని, తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి రూ.3లక్షల లోపు తలసరి ఆదాయం ఉన్నవారు అవసరమైన పక్షంలో ఉచిత సహాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని న్యాయమూర్తి సబ్బవరపు వాణి స్పష్టం చేశారు. మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి అధ్యక్షతన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయ సేవ అధికార చట్టం ప్రకారం అవసరమైన వారికి ఎటువంటి ఖర్చు లేకుండా ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామన్నారు. సదస్సులో ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి జి.అప్పలనాయుడు, న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు అల్లు సత్యాజీ, కార్యదర్శి కెవిఎస్ రామరాజు, ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, పలువురు న్యాయవాదులు మాట్లాడారు. అనంతరం జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు.

కొత్తవలస: స్థానిక కోర్టు ఆవరణలో న్యాయ సేవల దినోత్సవం జరిగింది. న్యాయమూర్తి ఎస్.సూర్య కిరణ్ శ్రీ మాట్లాడుతూ కక్షి దారులు న్యాయ సేవలను వినియోగించు కోవాలని తెలిపారు. న్యాయ వాదులు డి.శ్రీనివాస్, వై.జి.నాయుడు, జి.కృష్ణ, పి.ఉమాదేవి తదితరులు న్యాయ వాదులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

వేపాడ : మండలంలో వావిలిపాడు, సోంపురం, వేపాడ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న నాడు - నేడు రెండో విడత పనులను ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ దేవి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాలుండ కూడదన్నారు. పనులు నిత్యం పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షణలో జరగాలన్నారు. ఈ పరిశీలనలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ ఛైర్మన్, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

రేగిడి : విద్యార్థులు ఓటు హక్కు పై అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ టీ. కళ్యాణ చక్రవర్తి సూచించారు. బుధవారం ఉంగరాడ మెట్ట గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ బుచ్చిరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్వీప్ యాక్టివిటీస్ కింద ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు పై విద్యార్థులు చైతన్యవంతం కావాలన్నారు.

పేదలే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

డెంకాడ: వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, ఎంపి, ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- రేగిడి

పేదవాడే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేసఉతన్నామని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. ఈ మేరకు బుధవారం బాలకావివలసలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలహీన వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేవా అనే విషయాన్ని తెలుసుకునేందుకే ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి టంకాల అచ్చెం నాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు, మండల విప్ మజ్జి శ్రీనివాసరావు, కెంబూరు వెంకటేశ్వరరావు, ఎంపిడిఒ జి. కాశీ విశ్వనాధరావు, తహశీల్దార్ టి. కళ్యాణ్ చక్రవర్తి, ఎంఇఒ ఎం. వరప్రసాదరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ శ్రీ చరణ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని చొల్లంగిపేటలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పాల్గొని మాట్లాడారు. ముందుగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్ బాబు, ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు, జెడ్‌పిటిసి బడ్డుకొండ లక్ష్మి, ఎంపిడిఒ డిడి స్వరూపారాణి, తహశీల్దార్ పి. ఆదిలక్ష్మి, డెంకాడ పిఎసిఎస్ ఛైర్మన్ రొంగలి కనకసింహాచలం, ఎఎంసి వైస్ ఛైర్మన్ చింతపల్లి రామ్మూర్తి, సర్పంచ్ కోరాడ కనకరాజు, డి.కొల్లం సర్పంచ్ శివకృష్ణ, పినతాడివాడ సర్పంచ్ లంక లక్ష్మణరావు, ఎంపిటిసి కిరణ్‌కుమార్, వెలుగు ఎపిఎం విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలన అందిస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రం సచివాలయం-1 పరిధిలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి గడపకూ వెళ్లి మూడేళ్ళ పాలనలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. మూడేళ్లలో ఆ కుటుంబం పొందిన లబ్ధిని ఎమ్మెల్యే శంబంగి వివరించి బుక్ లేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి మండల పార్టీ అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, నాయకులు తెంటు మధు, వైస్ ఎంపిపి బొమ్మినాయని రమేష్, గుంట సంగయ్య, ఎంపిడిఒ అక్కారావు, వివిధ గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో అదుపులో లంపిస్కిన్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధికారి రమణ

ప్రజాశక్తి- బొబ్బిలి

పశువులకు టీకాలు వేయడంతోనే లంపి చర్మ వ్యాధి అదుపులో ఉందని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి వైవి రమణ తెలిపారు. బొబ్బిలి పశుసంవర్ధక కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 1.96లక్షల పశు వులకు టీకాలు వేయడంతో లంపి చర్మ వ్యాధి అదుపులో ఉందన్నారు. లంపి చర్మ వ్యాధి బారిన పడిన ఆవులు పాలు తాగ వచ్చునన్నారు. మరో 80వేల డోసులు టీకాలు తెప్పించి సిద్ధంగా ఉంచుతున్నామన్నారు. వ్యాధిని అదుపు చేసేందుకు సంతలు రద్దు చేశామని, ఇతర జిల్లాలు, రాష్ట్రాలు నుంచి పశువుల రాకపోకలను నివారించేందుకు తారపురం వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేశామని చెప్పారు. 4 నుంచి 8నెలల ఆవు పెయ్యిలకు బ్రూసిల్లోశిష్ టీకాలు వేస్తున్నామన్నారు. 80వేల పెయ్యిలకు టీకాలు వేసేందుకు లక్ష్యం పెట్టుకోగా ఇప్పటికే రెండు విడతాలలో 40వేలు పెయ్యిలకు టీకాలు వేశామన్నారు. 75శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలు, మిశ్రమ దాణా సరఫరా చేస్తున్నామన్నారు. పాడి రైతులకు పశుకిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఆడ పెయ్యిల ఉత్పత్తి పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. పశువులకు నాణ్యమైన దాణా అందించేందుకు దాణా అమ్మకం షాపులపై ప్రతినెల దాడులు చేసి నాణ్యత పరీక్షలు చేస్తున్నామన్నారు. నాణ్యత లేకపోతే కేసులు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు శత శాతం వేశామన్నారు. జిల్లాలో 6వేల మంది రైతులకు పశువుల భీమా రూ.8కోట్లు బకాయి ఉందని, రూ.4కోట్లు చెల్లించేందుకు ప్రతిపాదనలు చేశామన్నారు. ఆయనతో డిడి రెడ్డి నీలయ్య ఉన్నారు.

వెటనరీ అసిస్టెంట్ల పనితీరుపై అసంతృప్తి

రైతు భరోసా కేంద్రాల్లో పని చేస్తున్న వెటనరీ అసిస్టెంట్ల పనితీరుపై పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి వైవి రమణ అసంతృప్తి వ్యక్తం చేశారు. పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో డివిజన్ పరిధిలో ఉన్న పశు వైద్యులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో పని చేస్తున్న వెటనరీ అసిస్టెంట్లు పాడి రైతులకు మెరుగైన సేవలు అందించడం లేదన్నారు. గర్భోత్పత్తి ఇంజెక్షన్ల కోసం రైతులు గోపాల మిత్రలను ఆశ్రయిస్తున్నారని చెప్పారు. వెటనరీ అసిస్టెంట్లు ఏమి చేస్తున్నారో పర్యవేక్షణ చేయాలన్నారు. వారానికి ఒక రైతు భరోసా కేంద్రానికి వెళ్లి పనితీరును పర్యవేక్షణ చేయాలని వైద్యులకు సూచించారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

విద్యుత్ ప్రమాదాలు నివారణకు భద్రతా ప్రమాణాలు పాటించాలని విద్యుత్ శాఖ ఇఇ పూడి హరి కోరారు. తన కార్యాలయంలో భద్రతా ప్రమాణాలపై బుధవారం ఎలక్ట్రిషిన్లకు అవగాహన కల్పించారు. నూతన ఇళ్లకు, అపార్టుమెంట్లకు వైరింగ్ చేసేటప్పుడు ఐఎస్ఐ వైర్లు, స్విచ్చులు, షాకెట్స్ వినియోగించాలన్నారు. లోడ్‌కు సరిపడా సామర్ధ్యం ఉన్న సర్వీసు వైర్‌ను విద్యుత్ మీటరు నుంచి విద్యుత్ స్తంభానికి వేయాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు నివారణకు సహకరించాలని కోరారు.

భవన నిర్మాణ కార్మికులకు అవగాహన

విద్యుత్ ప్రమాదాలు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై భవన నిర్మాణ కార్మికులకు ఏడిఏ ఎం.లక్ష్మినారాయణ అవగాహన కల్పించారు. తాండ్రపాపరాయ జంక్షన్‌లో భవన నిర్మాణ కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన్ నిర్మాణ పనులు చేసేటప్పుడు విద్యుత్ స్తంభాలు, వైర్లను గమనించి పని చేయాలన్నారు. భవనాలు పైనుంచి విద్యుత్ వైర్లు ఉంటే దూరంగా ఇంటి నిర్మాణం చేయాలని లేదంటే విద్యుత్ స్తంభం మార్చేలా యజమానికి చెప్పాలని అన్నారు. జాగ్రత్తలతో ప్రమాదాలను నివారించవచ్చు నన్నారు.

వికలాంగులను భాగస్వాములను చేయాలి

పూసపాటిరేగ : సమాజంలో జరిగే అన్ని కార్యక్రమాల లోనూ వికలాంగులను భాగస్వాములను చేయాలని జిల్లా సహిత విద్య సమన్వయాధికారి ఎస్. సూర్యారావు అన్నారు. బుధవారం స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో వికలాంగ పిల్లలకు జరుగుతున్న ఫిజియోథెరపీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వికలాంగులను ఇంటా, బయటా జరిగే అన్ని కార్యక్రమాలలోనూ భాగస్వాములను చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. తద్వారా వారిలో తాము కూడా అందరితో సమానమనే భావన ఏర్పడి ఆత్మవిశ్వాసం కలుగుతుందన్నారు. దీనికై అన్ని వర్గాల సమన్వయం, సహకారం అవసరమని చెప్పారు. జిల్లాలోని అన్ని మండలాలలోను సమగ్రశిక్షా ఆధ్వర్యంలో మానసిక వికలాంగ పిల్లలకు భవిత కేంద్రాలు నడుస్తున్నాయని, అక్కడ విద్యార్థుల స్థాయికి తగిన బోధన జరుగుతుందని చెప్పారు. తల్లిదండ్రులు వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని సూర్యారావు సందర్శించి రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి పి. లలితకుమారి, సహితవిద్య ఉపాద్యాయుడు ఎం. వెంకటేశ్వరరావు, ఫిజియోథెరపిస్టు డి. హిమబిందు, పలువురు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న సూర్యారావు

గర్భిణులకు వైద్య పరీక్షలు

వేపాడ: గర్భిణులకు భోజనాలు పెడుతున్న డాక్టర్, సర్పంచ్

ప్రజాశక్తి - కొత్తవలస

ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వియ్యంపేట పిహెచ్‌సిలో వైద్యాధికారి ఇ.గోపాలకృష్ణ 52 మంది గర్భిణిలకు తనిఖీలు నిర్వహించారు. వీరిలో 21 మంది హై రిస్క్ గర్భిణులు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా గర్భిణులు 4 తనిఖీలు చేయించుకోవాలని, ఎర్లీ రిజిస్ట్రేషన్ జరగాలని. 2 టి.టి. ఇంజెక్షన్స్ చేసుకోవాలని తెలిపారు. ప్రతి గర్భిణీ నమోదు నుండి డెలివరీ వరకు 100 చొప్పున గుడ్లు, పాలు, బెల్లం పప్పు ఉండలు, కాల్షియం, ఐరన్ మాత్రలు వేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే డెలివరీలు చేసుకోవాలని, మాతా, శిశు మరణాలు జరగకుండా చూడాలని తెలిపారు. గర్భిణీలందరికి బిపి, షుగర్, హెచ్.బి, మూత్ర పరీక్షలు చేసి,హిమో గ్లోబిన్ తక్కువ ఉన్నవారికి ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్స్ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా నోడల్ ఆఫీసర్ టి. పద్మావతి, ఎంఎల్‌హెచ్‌పిలు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఏఎన్‌లు, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని బొద్దాం పిహెచ్‌సిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ వైద్య సేవలో భాగంగా 56 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 20 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారికి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సతీష్ కుమార్ గర్భిణులకు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎర్ర రామసత్యవతి, ఎంపిటిసి పిల్లా లక్ష్మి పిహెచ్‌సి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఒకే ఈతలో మూడు దూడలు

ప్రజాశక్తి- దత్తిరాజేరు

సాధారణంగా ఒక ఈతలో ఒక దూడ జన్మిస్తుంది. అందుకు భిన్నంగా మండలంలోని తాడేందొరవలస గ్రామంలో బుధవారం ఆవుకు ఒకేసారి మూడు దూడలు జన్మించాయి. మూడూ ఆడదూడలు కావడంతో లక్ష్మీ, సరస్వతి, పార్వతీలు వాటికి నామకరణం చేసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని కొండ్రు పాపమ్మ, భర్త సింహాచలం గోవులును కాస్తూ వ్యవసాయం చేసుకుంటారు. వారికున్న ఆవుల్లో ఒక ఆవుకు మూడు ఆడ దూడలు జన్మించడంతో అంతా ఆశ్చర్యపోతున్నారు. ఈ విషయం తెలిసి ఆ దూడలను చూసేందుకు జనం క్యూ కడుతున్నారు.

ఒకే ఈతలో పుట్టిన మూడు దూడలు

పట్టభద్రుల ఓట్లకు 1181 దరఖాస్తులు

వేపాడ : మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పట్ట భద్రుల ఓట్ల కోసం 1181 దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దార్ ఎస్.కృష్ణంరాజు తెలిపారు. తన కార్యాలయంలో ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడారు. ఈ దరఖాస్తుల్లో ఆన్‌లైన్‌లో 449, ఆఫ్‌లైన్‌లో 682 మంది నమోదు చేసుకున్నారని తెలిపారు.

ఆయిల్ ట్యాంకర్ చోరీ

● కోల్‌కత్తాలో పట్టుకున్న పోలీసులు

చోరీ వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని లింగాలవలస శ్రీనివాస ఆయిల్ మిల్లు నుంచి కలకత్తాకు వెళ్లే క్రూడ్ ఆయిల్ లారీ టాంకర్ చోరీకి గురైందని చాకచక్యంగా వ్యవహరించి ఆయిల్ ట్యాంకర్ లారీ స్వాధీనం చేసుకుని, డ్రైవర్ ఎస్.కె అహ్మద్‌ను అరెస్ట్ చేశామని ఎస్ఐ ఇ. శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం రేగిడి పోలీస్ స్టేషన్ వద్ద నిందుతున్ని ప్రవేశ పెట్టి విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. రాజమండ్రికి చెందిన రాజా లారీ సర్వీసు యజమాని ఎంఎ ఫారుక్ గత 20 ఏళ్ల నుంచి ఆయిల్ ట్యాంకర్లతో కమిషన్‌కు లారీ సప్లయ్ వ్యాపారం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లింగాలవలస శ్రీనివాస పామాయిల్ క్రూడ్ ఆయిల్ కోసం ఆయిల్ ట్యాంకర్ లారీని పంపించారు. అక్టోబర్ 22న సుమారు రూ.22 లక్షల విలువచేసే 22 మెట్రిక్ టన్నుల క్రూడ్ ఆయిల్ ట్యాంకర్‌తో కలకత్తా పంపించారు. అక్టోబరు 23న కలకత్తా చేరాల్సిన ఆయిల్ ట్యాంకర్ లారీ ఎప్పటికీ చేరకపోవడంతో క్రూడ్ ఆయిల్ ఓనర్ ఇంకా ట్యాంకర్ రాలేదని రాజమండ్రికి చెందిన షారుక్‌కు అక్టోబర్ 26న ఫోన్ చేశారు. దీంతో వెంటనే ట్యాంకర్ డ్రైవర్ ఎస్.కె అహ్మద్‌కు షారుక్ ఫోన్ చేయటంతో స్విచ్ ఆఫ్ వచ్చింది. అక్టోబర్ 31న ఆయిల్ ట్యాంకర్ లారీ చోరీకి గురైందని గుర్తించి షారుక్ రేగిడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ తన బృందంతో 31 రాత్రి కలకత్తా బయలుదేరి వెళ్లారు. ఆయిల్ ట్యాంకర్ నెంబర్ ప్రకారం హైవేలో అన్ని టోల్ ప్లాజా సిసి పుటేజ్ ఆధారంగా చూశారు. వెస్ట్ బెంగాల్ రాంపూర్ టోల్ ప్లాజా నుంచి ఆయిల్ ట్యాంకర్ సిసి పుటేజీలు కనిపించలేదు. లోకల్ పోలీసులను సంప్రదించగా పట్టించుకోలేదు. డ్రైవర్ ఎస్ కే అహ్మద్ ఓటర్ కార్డు ఆధారంగా చిరునామా కనుక్కున్నారు. అనంతరం కలకత్తాలో డ్రైవర్‌ను అరెస్టు చేశారు. ఇతనికి ఆశిక్ ఇక్బాల్ అనే తోడై ఇద్దరూ కలిసి క్రూడ్ ఆయిల్ అమ్మకాలు చేసిన అనంతరం ఆయిల్ ట్యాంకర్ లారీ నెంబర్ ప్లేటు, లారీ బాడీని మార్చి వేరే నెంబర్ ప్లేట్‌తో అమ్మకాలకు సిద్ధమయ్యారు. వీరిద్దరితో పాటు మరికొంతమంది గ్యాంగ్‌తో ఇలానే మోసం చేసి అమ్మకాలు చేపడతారని గుర్తించినట్లు ఎస్ తెలిపారు. డ్రైవర్‌ను అరెస్టు చేసి ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకొని రేగిడి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చామని అతన్ని రాజాం కోర్టుకు రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

FACOR ALLOYS LIMITED

Regd. Office : Shreeramnagar - 535 101, Garividi, Dist. Vizianagaram (A.P.) CIN: L27101AP2004PLC043252
WEBSITE : www.facoralloys.in PHONE : +91 8952 282029 FAX : +91 8952 282188 E-MAIL : facoralloys@falgroup.in

STATEMENT OF UNAUDITED STANDALONE AND CONSOLIDATED FINANCIAL RESULTS FOR THE QUARTER AND HALF YEAR ENDED 30TH SEPTEMBER, 2022

(₹ in Lakhs)

SR. NO.	PARTICULARS	STANDALONE					CONSOLIDATED				
		Quarter Ended			Half Year Ended		Quarter Ended			Half Year Ended	
		30th September 2022	30th June 2022	30th September 2021	30th September 2022	30th September 2021	30th September 2022	30th June 2022	30th September 2021	30th September 2022	30th September 2021
		Unaudited	Unaudited	Unaudited	Unaudited	Unaudited	Unaudited	Unaudited	Unaudited	Unaudited	Unaudited
1	Total Income from operations	6,877.25	6,181.55	6,594.67	13,058.80	12,043.40	6,877.25	6,181.55	6,595.27	13,058.80	12,074.49
2	Net Profit / (Loss) for the period (before Tax, Exceptional and / or Extraordinary items)	(367.88)	242.80	1,015.09	(125.08)	1,247.07	(374.65)	238.61	996.52	(136.04)	1,235.33
3	Net Profit / (Loss) for the period (before Tax, after Exceptional and / or Extraordinary items)	1,448.52	245.50	828.71	1,694.02	1,066.68	1,441.75	241.31	817.20	1,683.06	1,062.00
4	Net Profit / (Loss) for the period after Tax (after Exceptional and / or Extraordinary items)	2,234.64	195.49	633.55	2,430.13	789.10	2,227.87	191.30	622.04	2,419.17	784.42
5	Total Comprehensive Income for the period [comprising Profit/ (Loss) for the period (after tax) and Other Comprehensive Income (after tax)]	2,233.40	194.23	625.88	2,427.63	773.78	2,306.15	190.04	612.12	2,496.19	766.85
6	Equity Share Capital	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48
7	Other Equity (excluding Revaluation Reserve)#	—	—	—	—	—	—	—	—	—	—
8	Earnings per share (before extraordinary items) (of ₹ 1/- each) (not annualised) :										
	(a) Basic	1.14	0.10	0.32	1.24	0.40	1.14	0.10	0.32	1.24	0.40
	(b) Diluted	1.14	0.10	0.32	1.24	0.40	1.14	0.10	0.32	1.24	0.40

Other Equity (excluding Revaluation Reserve) for the year ended 31st March, 2022 is ₹ 14,514.56 lakhs for standalone and ₹ 15,156.98 lakhs for consolidated result.

Notes:
1 The above is an extract of the detailed format of Quarterly and Half Yearly Financial Results filed with the Stock Exchange under Regulation 33 of the SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulation, 2015. The full format of the Quarterly and Half Yearly Financial Results are available on the website of Stock Exchange at **www.bseindia.com** and on the Company's website **www.facoralloys.in.**
2 Previous period figures are regrouped/rearranged wherever necessary to facilitate comparison.

Place : New Delhi
Date : 09th November, 2022

For FACOR ALLOYS LIMITED,
R. K. SARAF
CHAIRMAN & MANAGING DIRECTOR
(DIN : 00006102)

aaamedia.in